క్లుప్తంగా

ముగిసిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి నిర్వహిస్తోన్న కాజ సత్యవతిదేవి, లక్ష్మీనరసింహారావు మెమోరియల్ బాల కళావేదిక 12వ చిల్డ్రన్ డాన్స్ ఒలింపియాడ్ శనివారం ముగిశాయి. కూచిపూడి జూనియర్ నృత్య పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 13 మంది కళాకారులు పోటీపడ్డారు. ఉత్తమ ప్రదర్శనలకు ఎంపికైన వారికి బాలకళారత్న పురస్కారాలను అందించారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన అచ్యుత మానస, కొర్లకుంట వైష్ణవిలకు నాటరాజపద స్వర్ణమంజీర పురస్కారం అందించారు. మంచాల కృతి నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం, కాజ శ్యాంసుందరరావు, కోశాధికారి నాగలక్ష్మి, వెంకటగిరి పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత



నగరంపాలెం: ఇటీవల మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కులను ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం అందజేశారు. గత నెలలో అనారోగ్య కారణాలతో ఏఎస్‌ఐ కె.అరుణాచలం(తుళ్లూరు పీఎస్), ఏఆర్ఎస్‌ఐ ఓ.మాణిక్య రావు(డీపీయూహెచ్) మరణించారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులకు మంజూరైన విడో, ఫ్లాగ్ ఫండ్ చెక్కులను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరరావు, జిల్లా పోలీస్ సంఘం సంయుక్త కార్యదర్శి లక్ష్మయ్య, కోశాధికారి హుస్సేన్ పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్‌లో ఎక్స్‌పోకు విశేష స్పందన



కొరిటిపాడు: గుంటూరు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో మూడు ప్రాంతాలకు (గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం) సంబంధించి ప్రాపర్టీ ఎక్స్‌పో శనివారం నిర్వహించారు. ప్రాపర్టీ ఎక్స్‌పోలో వేలం కోసం 21 ఆస్తులు ప్రదర్శించినట్లు చీఫ్ మేనేజర్ బి.కె.ప్రసాద్ తెలిపారు. సందర్శకులు కొన్ని ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, సందర్శకులు పాల్గొన్నారు.

స్వాములకు సద్ది ప్రారంభం

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో ఏంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారులు చంద్రశేఖరశర్మ నిర్వహణలో చతుర్దశ(14వ) అన్నప్రసాద సద్ది వితరణ శనివారం ప్రారంభమైంది. ఉదయం గోపూజ, గణపతి హోమం, అయ్యప్పస్వామికి శరణు ఘోషతో విశేషాభిషేకాలు జరిగాయి.

అనంతరం కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్పలకు, భవానీలు, శివ స్వాములు, మాల ధరించిన స్వాములకు ఈనెల 16 నుంచి వచ్చేనెల 26 సద్ది కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

లక్ష్మీపురం: అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో పేకాటాడుతున్నారన్న స్పెషల్ బ్రాంచ్ సమాచారం మేరకు నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని శనివారం రాత్రి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు.. అరండల్‌పేట 9వలైనులో నలుగురు వ్యక్తులు పేకాటాడుతున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు స్టేషన్ ఎస్ఐ కృష్ణబాజి సిబ్బందితో కలసి దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.19,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

నేటి నుంచి పాక్షికంగా నీటి సరఫరా

నెహ్రూనగర్: నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసే ప్రధాన పైపులైనుపై ఏర్పడిన లీకులకు ఇంజినీరింగ్ అధికారులు శనివారం రాత్రికి పూర్తి చేశారు. ఆదివారం ఉదయం నుంచి పాక్షికంగా సాయంత్రం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరిపేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ప్యాంక్రియాటిక్‌కు క్యాన్సర్ ముప్పు

ధూమపానంతో క్యాన్సర్ సోకే ప్రమాదం

ప్రతి ఏడాది పెరుగుతున్న బాధితులు

నవంబరు ప్యాంక్రియాటిక్‌పై అవగాహన మాసం

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా బెంగళూరులో విధులు నిర్వహిస్తున్నాడు. స్నేహితుల ప్రోద్బలం, పని ఒత్తిడితో సిగరెట్ తాగడం అలవాటు చేసుకున్నాడు. ఇటీవల కాలంలో ఆకస్మాత్తుగా బరువు తగ్గిపోయాడు. ఆకలి కూడా మందగించడంతో వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షలు చేసి ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ సోకినట్లు నిర్ధారించి చికిత్స అందించారు. ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించడం ద్వారా వ్యాధి నుంచి కోలుకుని ఉద్యోగం చేసుకుంటున్నాడు. అయితే అనేక మంది వ్యాధి సోకిన విషయాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించకపోవడం ద్వారా ప్రాణాలు కోల్పోతున్నట్లు క్యాన్సర్ వైద్య నిపుణులు వెల్లడించారు.

యువతలో సరదాగా మొదలై..

యవ్వనంలో సరదాగా మొదలు పెట్టే పొగ తాగే అలవాటు మనిషి ప్రాణాలను తీస్తుందన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతి ఏడాది స్మోకింగ్ వలన క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. స్మోకింగ్ ద్వారా వస్తున్న క్యాన్సర్‌లలో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ముఖ్యమైంది. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా నయం చేయవచ్చు. ప్రతి ఏడాది నవంబరు నెలను ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

లక్షణాలు

జీర్ణ వ్యవస్థలో ఒక భాగమే ప్యాంక్రియాస్. ఇది పొత్తికడుపులో ఉంటుంది. జీర్ణక్రియను సులభతరం చేయడంతోపాటు, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. ప్యాంక్రియాటిక్స్‌లోని కణాలు, వాటి డీఎన్ఏలో మార్పులు, ఉత్పరివర్తనాలను అభివృద్ధి చేసినప్పుడు క్యాన్సర్ సోకుతోంది. ఈ వ్యాధి సోకిన వారిలో ఆకలి మందగిస్తుంది. ఆకస్మాత్తుగా బరువు తగ్గిపోతారు. మూత్రం ముదురు రంగులో వస్తుంది. మలం రంగులో మార్పులు వస్తాయి. చర్మం, కళ్లు రంగు మారిపోయి పసుపు రంగులోకి వస్తాయి. కొన్ని సందర్భాల్లో జాండీస్ సోకినట్లుగా భావిస్తారు. చర్మంపై దురద వస్తుంది. వెన్నునొప్పి, పొత్తికడుపు నొప్పి వస్తుంది. ఒక చెయ్యి, కాలిలో నొప్పి, వాపు వస్తుంది.

కారణాలు

ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం ధూమపానం చేయడం. కొన్ని సందర్భాల్లో ఆల్కహాల్ తీసుకోవడం ద్వారా కూడా వ్యాధి సోకుతోంది. కుటుంబంలో ఎవరికైనా వ్యాధి సోకి ఉంటే వారసత్వంగా ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. ఊబకాయం, మధుమేహం, ప్యాంక్రియాటిక్స్ క్యాన్సర్‌ను పెంచుతాయి.



ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ పోస్టులు

నిర్ధారణ

సిటీస్కాన్, పెట్ స్కాన్, నిడిల్ బాయాప్సీ, ఎమ్మార్‌సీపీ, ఎమ్మారై, ఈఆర్సీపీ, బయాప్సీ, రక్త పరీక్షలు, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్, ల్యాప్రోస్కోపి, మలపరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు.

బాధితులు

జిల్లాలో 10 మంది సర్జికల్ ఆంకాలజిస్టులు, 20 మంది మెడికల్ ఆంకాలజిస్టులు క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఏడుగురు ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

జాగ్రత్తలు

మద్యపానం, ధూమపానం మానివేయాలి. ఆరోగ్యకరమైన ఆహార సమయాలు పాటించడంతోపాటు, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి. అధిక బరువు లేకుండా అదుపులో పెట్టుకోవాలి. క్రమం తప్పకుండా ప్రతిరోజూ వ్యాయామం చేయాలి.

ఆధునిక చికిత్సలతో కట్టడి చేయవచ్చు



క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించే అత్యాధునిక వైద్య చికిత్సా పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయడం ద్వారా క్యాన్సర్‌ను పూర్తిగా నివారించవచ్చు. ఆపరేషన్‌తో వ్యాధిని నయం చేయవచ్చు. కీమో థెరపిలో అత్యాధునిక మందులు ఉన్నాయి. రేడియేషన్ థెరపి, వైద్య సేవల్లో కూడా ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది.

–డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

ప్రస్తుతం రాష్ట్ర ఖజానా మొత్తం ఖాళీ..

- ఇప్పుడిప్పుడే కుదుటపడుతోంది
- పురపాలక శాఖ మంత్రి నారాయణ
- బిల్డర్లకు అన్ని రకాలుగా సహకరిస్తాం

నెహ్రూ నగర్: ప్రస్తుతం రాష్ట్ర ఖజానా మొత్తం ఖాళీ అయిందని.. ఇప్పుడిప్పుడే కొంచెం కుదుట పడుతుందని పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. నేరెడ్కో(నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్) కేపిటల్ జోన్ ప్రాపర్టీ షో బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శాఖ నుంచి బిల్డర్లకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక స్థితి పెరగాలంటే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందాలన్నారు. భవన లే అవుట్లు అనుమతులను సులభతరం చేస్తున్నామని వివరించారు. గుంటూరులో తాగునీరు, పార్కులు, వీధి వ్యాపారులు సమస్యలు, పార్కింగ్ సమస్యలపై దృష్టి పెడతామని హామీ ఇచ్చారు. అనధికార నిర్మాణాలు, లే అవుట్‌లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గుంటూరు- మంగళగిరి- విజయవాడ- అమరావతి కలిపి భవిష్యత్తులో మెగాసిటీగా చేయాలని సీఎం నిర్ణయించారనీ ఈ సందర్భంగా చెప్పారు. కోటి మంది జనాభాతో మెగా సిటీగా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు.

లీకులు.. ఓ అంతులేని కథ

- నెహ్రూనగర్ నుంచి హెచ్ఎల్ఆర్ ప్రధాన పైపులైన్‌పై తరచూ లీకులు
- ప్రత్యామ్నాయంగా వేరొక పైపులైన్ గత ప్రభుత్వంలో ఏర్పాటు
- సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ వద్ద పైపులైన్ ఏర్పాటుకు కొన్ని అడ్డంకులు



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పైపులైన్ లీకులకు మరమ్మతులు దృశ్యం

నెహ్రూనగర్: నగరానికి తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ లీకులు అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్(గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి) రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసే ప్రధాన పైపులైన్ సంజీవయ్యనగర్ రైల్వే గేటు కింద నుంచి వెళ్తోంది. అయితే ఈ పైపులైన్ వేసి కొన్ని దశాబ్దాలు కావడంతో తరుచూ సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద లీకులు ఏర్పడి రోజుకు కొన్ని లక్షల లీటర్లు తాగునీరు కాలువల్లో వృథాగా పోతున్నాయి. సంవత్సరంలో నాలుగు సార్లు పైపులైన్‌పై ఒత్తిడి పడి లీకులు ఏర్పడంతో ప్రతి సారి నాలుగు నుంచి రూ.10 లక్షల లోపు ఖర్చు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయంగా చూపిన..

గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి నీరు సరిపడ రాకపోవడంతో ఉన్న పాత పైపులైన్ స్థానంలో కొత్త పైపులైన్ ఏర్పాటు చేసింది. అయితే ఈ పైపులైన్ హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్ నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటు వరకు సజావుగా వచ్చింది. సంజీవయ్యనగర్ రైల్వే గేటు నుంచి నెహ్రూనగర్‌కు కేవలం కొద్ది మీటర్లు మాత్రమే పైపులైన్ వేయాల్సి ఉంది. ఇక అక్కడ నుంచి పైపులైన్ వేయడానికి ఇంజినీరింగ్ అధికారులకు తిప్పలు మొదలయ్యాయి. సంజీవయ్యనగర్ రైల్వే గేటు పక్కనే చర్చి ఉండటంతో దాని పక్క నుంచే పైపులైన్ వేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఈ పైపులైన్ ఏర్పాటు వలన చర్చి నిర్మాణం దెబ్బతినే పరిస్థితి ఉందని చర్చి పెద్దలు అభ్యంతరం చెప్పడంతో ప్రత్యామ్నాయంగా పక్కనే ఉన్న జనవాసాల మధ్య నుంచి పైపులైన్ వేసేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే వారు మాది ఇది ప్రైవేట్ స్థలం అని...ఇక్కడ పైపులైన్ వేసే క్రమంలో మా ఇళ్లు దెబ్బతినే పరిస్థితి ఉందని వారు ఆక్షేపణ చెప్పడంతో గత కొద్ది నెలల నుంచి పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు పెండింగ్‌లోనే ఉంది. తాజాగా పాత పంపింగ్ లైన్‌పై లీకులు ఏర్పడంతో గత కొద్ది రోజుల నుంచి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతుంది.

జావిద్‌కు కాంస్య పతకం



గుంటూరు మెడికల్: పూణేలో నవంబరు 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన కెటిల్‌బెల్ స్పోర్ట్స్‌లో గుంటూరుకు చెందిన ఎండీ జావిద్ అహ్మద్ కాంస్య పతకాన్ని సాధించాడని ఏపీ గిరేవోయ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. వరల్డ్ కెటిల్‌బెల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆసియా కెటిల్‌బెల్ చాంపియన్‌షిప్‌లో పతకం జావిద్ అహ్మద్ సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ 24 కేజీల కెటిల్‌బెల్ పది నిమిషాల ఈవెంట్‌లో జావిద్ అహ్మద్ కాంస్య పతకాన్ని సాధించినట్లు వెల్లడించారు. అసోసియేషన్ తరపున జావిద్ అహ్మద్‌కు అభినందనలు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఎస్‌హెచ్ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ టి.సేవకుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరు రమేష్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రపంచ మధుమేహం నిరోధక మాసం సందర్భంగా ప్రతి ఆదివారం ఒక స్పెషలిస్టుతో ఉచిత వైద్య శిబిరాలు, శాస్త్రీయ అవగాహన సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు గుంటూరులోని 2/1 బ్రాడీపేటలోని ఎస్. హెచ్. ఓ. బిల్డింగులో నిర్వహించే వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభలో మెదడు, నరముల వైద్య నిపుణులు డాక్టర్ పి.నటరాజ పాల్గొంటారన్నారు.

ఆవుల నియంత్రణకు బృందాలు

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలో వీధులలో సచరించే ఆవులు, దూడలు, గేదెలు, ఎద్దులు నియంత్రణ కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో 4 ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగర పాలక సంస్థ చేపడుతున్న ప్రత్యేక చర్యలలో భాగంగా ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ప్రజలకు అసౌకర్యం కలుగకుండా, వాహన చోదకులకు సమస్యలు తలెత్తకుండా వీధులలో సంచరించే ఆవుల యజమానులతో కలసి తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్ చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్సీ మాణిక్యరావు చిరస్మరణీయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకులకు మెరుగైన జీవితాన్ని ఇచ్చేందుకు నిరంతరం కృషి చేసిన ఎంజే మాణిక్యరావు చిరస్మరణీయుడని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో శనివారం మాజీ ఎమ్మెల్సీ ఎంజే మాణిక్యరావు వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అధ్యాపకులకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు మాణిక్యరావు కృషి చేశారని, వారి హక్కుల సాధన కోసం ప్రభుత్వంతో నిరంతరం పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అనుబంధ కళాశాలల అధ్యాపక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ పి. మల్లికార్జునప్రసాద్, హిందూ కళాశాల అధ్యాపక సంఘ అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి, కార్యదర్శి పీవీ రాము, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



గుజ్జనగుండ్ల సెంటర్‌లో వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ అనుమతించిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు ఉండాలని, ర్యాంపులతో డ్రెయిన్లు ఆక్రమించకుండా చూడాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం రోజువారి పర్యటనలో భాగంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తనిఖీల నిమిత్తం శ్యామల నగర్, బృందావన్ గార్డెన్స్, రెడ్డిపాలెం ప్రాంతాలలో పర్యటించి, నిబంధనల ప్రకారం అనుమతించిన భవన నిర్మాణాలు ఉన్నది, లేనిది ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. అపార్ట్‌మెంట్ వద్ద ర్యాంపులు డ్రైయిన్లు, రోడ్లుపైకి ఉండుట గమనించి, వెంటనే ర్యాంపులు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం పర్యటనలో భాగంగా గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి చేబ్రోలు హనుమయ్య కంపెనీ వరకు తొలగించిన వీధి వ్యాపారులు, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించి, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వెడింగ్ హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేయాలని ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వీధి వ్యాపారులు రోడ్లు, డ్రెయిన్లు అక్రమించకుండా సహకరించాలని ఈ పర్యటనలో కార్పొరేటర్ మానం పద్మశ్రీ , సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహమాన్, టీపీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల దరఖాస్తుకు రేపు ప్రత్యేక కౌంటర్లు

నగరంలోని వీధి వ్యాపారులు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నగర పాలక సంస్థ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని ప్రతి ఒక్క తోపుడు బండి వీధి వ్యాపారి గుర్తింపు కార్డు పొందుటకు నగర పాలక సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్‌కు అవరోధంగా, మురుగు పారుదలకి అడ్డుగా డ్రెయిన్ల మీద వీధి వ్యాపారులు, చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ అడ్డంకిగా ఉన్నారన్నారు. నగరంలోని ప్రతి ప్రధాన రహదారులను దశలవారీగా తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు. తొలగించిన ప్రాంతాల్లో స్ట్రీట్ వెండర్లకు జీఎంసీ ద్వారా గుర్తింపు కార్డు అందించడానికి ఈ నెల 18 ఉదయం నుంచి నగర పాలక సంస్థ, బృందావన్ గార్డెన్స్ లోని సర్కిల్ కార్యాలయం నందు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నగర పాలక సంస్థ స్ట్రీట్ వెండింగ్ జోన్లు డిసెంబర్ 10 నాటికి ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

దివ్యాంగ వీధి వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

నెహ్రూనగర్: నగరంలో దివ్యాంగ వీధి వ్యాపారులకు వ్యాపారాల నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. శనివారం దివ్యాంగ వ్యాపారులు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నగర కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఇన్‌ఫెక్షన్ నియంత్రణకు ఫేజ్ థెరపి

- ఔషధ నిరోధకతను ఆపటానికి ఫేజ్ ఉపయోగపడుతుంది
- ఇన్‌ఫెక్షన్ స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి



ఈఎస్‌జీఎన్‌టీఏ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ర్యాన్‌నిర్‌పాజ్‌తో డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి

గుంటూరు మెడికల్: ప్రపంచాన్ని, ముఖ్యంగా వైద్య రంగాన్ని, వైద్యులను పట్టి పీడిస్తున్న ఔషధ నిరోధకతను ఆపటానికి ఫేజ్ థెరపి అందుబాటులోకి వస్తోందని గుంటూరు హెల్ప్ హాస్పిటల్ అధినేత, ఇన్‌ఫెక్షన్ స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. ఇన్‌ఫెక్షన్స్‌ను నియంత్రించాలనే లక్ష్యంతో యూరోపియన్ స్టడీ గ్రూప్ ఆన్ నాన్ ట్రెడిషనల్ యాంటీబయాటిక్స్ సొసైటీ ఈనెల 12, 13 తేదీల్లో ఫ్రాన్స్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఫేజ్ థెపితో ఇన్‌ఫెక్షన్స్‌ను నియంత్రించవచ్చని, ఔషధ నిరోధకతను ఆపటానికి ఫేజ్ ఎంతో ఉపయోగపడుతుందనే విషయాన్ని సమావేశంలో అభిప్రాయపడినట్లు చెప్పారు. ఈ చికిత్స ద్వారా రోగికి ఎలాంటి హాని జరగదని, కేవలం బ్యాక్టీరియాను మాత్రమే ఫేజ్ ఎటాక్ చేస్తుందన్నారు. నేడు వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక రావటంతో ఫేజ్ వినియోగంపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. భారత దేశంలో కూడా త్వరలో ట్రయల్స్ జరుగుతాయన్నారు. గత ఏడాది నవంబర్‌లో తమ ఆస్పత్రికి నెమ్ముతో వచ్చిన మహిళకు బెనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్‌నాథన్ సలహా మేరకు ఫేజ్ థెరపి చికిత్సతో నెమ్ము నుంచి విముక్తి కల్పించామన్నారు. అప్పటి నుంచి ఫేజ్ థెరపీపై ఆసక్తి పెంచుకుని యూరోపియన్ సొసైటీలో సభ్యుడిగా చేరి ఇన్‌ఫెక్షన్స్ నియంత్రణ కోసం తమ వంతు కృషి చేస్తున్నామని డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం



ఇన్‌చార్జిలను అభినందిస్తున్న నాయకులు విజయ్‌కుమార్, లింగంశెట్టి ఈశ్వరరావు

లక్ష్మీపురం: కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ఎంపిక చేసినట్లు జరిగిందని జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాచకొండ జాన్‌బాబు, తూర్పు ఇన్‌చార్జిగా షేక్ మస్తాన్‌వలి, తెనాలి ఇన్‌చార్జిగా చందు సాంబశివుడు, పొన్నూరు ఇన్‌చార్జిగా గాదె నాగేశ్వరరావు, మంగళగిరి ఇన్‌చార్జిగా షేక్ సలీం, తాడికొండ ఇన్‌చార్జిగా చిలకా విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా కొరివి వినయ్‌కుమార్‌లను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి శ్రీపతి ప్రకాశం, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్లా సునీల్, గద్దం పాల్ విజయ్ కుమార్ పీసీసీ ప్రధాన కార్యదర్శి బొట్ల బ్రహ్మయ్య రాహుల్, యూత్ అధ్యక్షులు మల్లెల మోషే పాల్గొన్నారు.

కాలువలో పసికందు మృతదేహం

గుంటూరు రూరల్: నగరశివారుల్లోని గుంటూరు పొన్నూరు రహదారి బుడంపాడు కాలువ కల్వర్టు వద్ద రోజుల పసికందు మృతదేహం లభ్యమైన ఘటన శనివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. సుమారు నాలుగు రోజులు వయసు ఉన్న బాలుడి మృతదేహాన్ని కాలువలో ఉందని స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. పసికందు మృతదేహాన్ని రుద్ర ట్రస్ట్ ద్వారా జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నీటిలో కొట్టుకువచ్చిందా? లేక ఎవరైనా తెచ్చి ఇక్కడ పడవేశారా? అనే అనుమానం వ్యక్తం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



సాఫ్ట్‌వేర్ కంపెనీ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, ఎస్ఎస్‌యూఐ నాయకులు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని ఆంజనేయపేట వద్ద డెలప్ ట్రీస్ రీడింగ్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగాల పేరుతో 650 మంది ఉద్యోగుల నుంచి రూ.కోట్లు వసూలు చేసి నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ప్రభుత్వం, పోలీసు అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం డిమాండ్ చేశారు. శనివారం ఐటీ సొల్యూషన్స్ కంపెనీ ముందు బాధితులకు మద్దతుగా ఎన్ఎస్‌యూఐ నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా కరీం మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో రూ. కోట్లు వసూలు చేసి మోసం చేసిన శ్రావణ్ దగ్గుబాటిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఐటీ సొల్యూషన్‌లో 650 మంది ఉద్యోగుల నుంచి అక్రమంగా దోచుకున్న కోట్లాది రూపాయలను తిరిగి మోసపోయిన ఉద్యోగులకు ఇప్పించాలని కోరారు. ఈ ఐటీ సొల్యూషన్‌లో పని చేసే వారిపై ఇప్పటికే అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం శోచనీయమన్నారు. ఒకరిద్దరిని మాత్రమే అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేయడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తక్షణమే శ్రావణ్‌ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా పనిచేయాలి

డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా మనమంతా పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏపీఎం లాజరు అధ్యక్షతన వీఓఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి స్త్రీనిధి, ఉన్నతి రుణాలు, రికవరీ, స్వయం ఉపాధి యూనిట్లు, మొబైల్ బుక్ కీపింగ్, సంఘాల ప్రగతి.. వంటి పలు అంశాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి టార్గెట్లుకు అనుగుణంగా ప్రతి ఒక్క వీఓఏ పనిచేయాల్సిందేనన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారులు, పితామహులు అయిన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుచరిత, వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత డెప్యూటీ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖరరావు, జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, అమీనాబేగం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు' అనే అంశంపై 6,7 తరగతుల విద్యార్థులతో పాటు డిజిటల్ గ్రంథాలయాలు అనే అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు, భారతదేశంలో ప్రజాస్వామ్యం విజయవంతమా అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.